నత్తనడకన వంతెన పనులు

- బిల్లులు రాక కాంట్రాక్టర్‌కు ఇబ్బందులు
- సకాలంలో పూర్తికాక గ్రామస్తుల ఇక్కట్లు

రాయికల్: మండలంలోని రామారావుపల్లి–ఇటిక్యాల పెద్ద వాగుపై వంతెన నిర్మాణపనులు నత్తనడకన సాగుతున్నాయి. 2023 లో వంతెన, ఇరువైపులా రహదారి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.9 కోట్లు మంజూరు చేయగా పనులు మాత్రం నత్తనడకన, నాసిరకంగా కొనసాగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కరువై కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. రాయికల్ మండలం రామారావుపల్లి గ్రామం నుంచి రాయికల్ పట్టణానికి రావాలంటే సుమారు 10 కి.మీ వరకు తిరిగి రావాల్సిందే. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే రామారావుపల్లి గ్రామస్తులు కేవలం 2 కి.మీ వ్యవధిలోనే ఇటిక్యాల గ్రామానికి వచ్చే అవకాశం ఉంది. దీంతో పాటు, మండల కేంద్రానికి సైతం సుమారు 5 కి.మీ వ్యవధిలో చేరే అవకాశం ఉండటంతో పాటు, వర్తక వ్యాపారాలు సైతం మెరుగుపడే అవకాశం ఉంది. వీటిని దృష్టిలో ఉంచుకుని వంతెన నిర్మాణం కోసం రూ.9 కోట్లు మంజూరు చేసినప్పటికీ కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు రాక నత్తనడకన పనులు కొనసాగుతున్నాయి.


రామారావుపల్లి-ఇటిక్యాల పెద్దవాగుపై వంతెన

నాసిరకం పనులు... పర్యవేక్షణ కరువు

వంతెనకు వినియోగించే కంకర, సిమెంట్ వంటివి నాసిరకమైనవి వినియోగించడంతో చేసిన పనుల్లో సైతం పగుళ్లు వచ్చాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో పనులు నాసిరకంగా కొనసాగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కాగా, కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు రాకపోవడంతో పనుల్లో నాణ్యత లోపించడంతో పాటు, నత్తనకడన సాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పనులు వేగవంతం అయ్యేలా చూడాలని, సకాలంలో పూర్తయ్యేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.


సాగుతున్న పనులు

వంతెన నిర్మాణం పూర్తి చేయాలి


మా గ్రామం నుంచి ఇటిక్యాల గ్రామం వరకు వాగుపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి. రాయికల్ మండలానికి వెళ్లాలంటే సమయంతో పాటు, దూరభారం తగ్గుతుంది.
– రాజమల్లేశ్, రామారావుపల్లి

పనులు పర్యవేక్షిస్తాం


వంతెన నిర్మాణ పనులను పర్యవేక్షిస్తాం. నాసిరకంగా పనులు చేపడితే సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు నిలిపివేస్తాం. కొంత వరకు బిల్లులు రాకపోవడం వాస్తవమే. అయినప్పటికీ కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చి పనులు పూర్తయ్యేలా చూస్తాం.
– ప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ

ఆర్‌ఎంపీ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి

కథలాపూర్: ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని తాండ్ర్యాలలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మండల ఆర్‌ఎంపీ, పీఎంపీల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. గతంలో దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఆర్‌ఎంపీ, పీఎంపీలకు ప్రభుత్వ పరంగా ఉచితంగా శిక్షణ ఇప్పించారని గుర్తు చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులు పరిమితికి లోబడి ప్రజలకు వైద్యం అందించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యుల సంఘం మండల అధ్యక్షుడు నర్సింహులు, కోశాధికారి మణికంఠ, గౌరవ అధ్యక్షుడు అల్లె రాజేందర్, మండల ప్రతినిధులు రాజ్‌కుమార్, కాయితి నాగరాజు, పులి హరిప్రసాద్, రాజశేఖర్, నరేశ్ పాల్గొన్నారు.


విప్‌ను సన్మానిస్తున్న ఆర్‌ఎంపీ సంఘం ప్రతినిధులు

త్వరలో లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు

జగిత్యాల: త్వరలోనే అర్హులైన అందరికి డబుల్‌బెడ్ ఇళ్లు అందజేయనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులను ప్రారంభించి మాట్లాడారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో అన్ని మౌలిక వసతులు కల్పించి, త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకవస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, వైస్ చైర్‌పర్సన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో ఆపరేషన్లు

సేవా దృక్పథంతోనే తాను ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని పలువురికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేశారు. పేదలు ఎవరైనా తన వద్ద ఉచితంగా ఆపరేషన్లు చేయించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో గంగాసాగర్ పాల్గొన్నారు.


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చెక్కులు పంపిణీ

జగిత్యాల: ముఖ్యమంత్రి సహాయనిధి పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని లబ్ధిదారులకు రూ. 1.85 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో ఆదివారం పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

రాయికల్: పట్టణంలోని పద్మశాలీ యువజన సంఘం క్యాలెండర్‌ను ఆదివారం పట్టణంలోని మార్కండేయ ఆలయంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, పద్మశాలీ సంఘ రాష్ట్ర కార్యదర్శి జక్కుల చంద్రశేఖర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మ్యాకల కాంతారావు, శ్రీరాముల సత్యానారాయణ, మ్యాకల రమేశ్, ఎలిగేటి అనిల్, హన్మాన్ ఆలయ కమిటీ చైర్మన్ దాసరి గంగాధర్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మచ్చ శేఖర్, పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌కు టీచర్ ఎంపిక

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్ జెడ్పీ హైస్కూల్‌లో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నల్ల సంజీవ్‌రెడ్డి వొడాఫోన్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఇంగ్లిష్ సబ్జెక్టులో నిరంతర వృత్తి నైపుణ్యాల అభివృద్ధి, వినూత్న బోధన పద్ధతులు, బోధనలో సాంకేతిక వినియోగం అనే అంశాలను పరిగణనలోకి తీసుకొని అవార్డుకు ఎంపిక చేసినట్లు సంస్థ ప్రతినిధులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనికి గాను ఇంగ్లిష్ ఉపాధ్యాయుడికి రూ. 25 వేలు స్కాలర్‌షిప్ సంస్థ ప్రతినిధులు అందిస్తారన్నారు. ఈ సందర్భంగా సంజీవ్‌రెడ్డిని హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా తెడ్డు శేఖర్


శేఖర్

కోరుట్ల/కథలాపూర్: ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా కథలాపూర్ మండలం సిరికొండ గ్రామానికి చెందిన తెడ్డు శేఖర్‌ను నియమిస్తూ ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సురుగు శ్రీనివాస్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి కృషి చేసిన జిల్లా, రాష్ట్ర నాయకులకు శేఖర్ కృతజ్ఞతలు తెలియజేశారు. లక్ష డప్పులు, వెయ్యి గొంతుకలు కార్యక్రమం విజయవంతం చేయాలని, కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎంఎస్పీ అధ్యక్షుడు దుమాల గంగారాం, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సురుగు శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్, పాల్గొన్నారు.

మర్కజీ ఇంతేజామి కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ముఖీమ్


ముఖీమ్

మెట్‌పల్లి: మర్కాజీ ఇంతేజామి కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ముఖీమ్‌ను నియమించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అక్తర్ జానీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయన పూర్తి స్థాయి కమిటీ ఏర్పాటులో భాగంగా ముఖీమ్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు. అక్తర్ జానీ ఆధ్వర్యంలో ముస్లిం సంఘ సంక్షేమానికి కృషి చేస్తానని ముఖీమ్ పేర్కొన్నారు.

గల్ఫ్ కార్మికులను ఆదుకుంటాం

మల్లాపూర్: గల్ఫ్ కార్మికులకు అండగా నిలిచి అన్ని విధాలుగా ఆదుకుంటామని గల్ఫ్ కార్మిక సంఘం నాయకులు అన్నారు. ఆదివారం దుబాయ్‌లో పలు గల్ఫ్ సంఘాలతో కలిసి వీవీరావుపేట్ గల్ఫ్ సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జీడబ్ల్యూపీసీ అధ్యక్షుడు గుండెల్లి నర్సింహా, బీజేపీ ఎన్‌ఆర్ఐ సెల్ అధ్యక్షుడు వంశీగౌడ్, సామాజిక సేవకుడు కట్కం రవి, ఆరె శరత్‌గౌడ్, వీవీరావుపేట్ అధ్యక్షుడు పెనుకుల అశోక్, నాయకులు ఆర్.శేఖర్, రఘుపతి, రఘు, సురేందర్, పాల్గొన్నారు.

మాదిగలు అధిక సంఖ్యలో హాజరు కావాలి

రాయికల్: జిల్లా కేంద్రంలో ఈ నెల 24న నిర్వహించే మాదిగల సన్నాహక సమావేశానికి మండలంలోని కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఎమ్మార్పీఎస్ రాయికల్ మండల అధ్యక్షుడు వేణుగోపాల్ అన్నారు. మందకృష్ణ మాదిగ పాల్గొనే సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి

మల్లాపూర్: మండలంలోని సాతారం జెడ్పీహెచ్‌ఎస్ అభివృద్ధికి కృషిచేస్తానని గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ డా. గండ్ర విద్యాధర్‌రావు అన్నారు. ఇటీవల పాఠశాలలోని విద్యార్థులకు వీయస్‌జీ అసిస్ట్ ఫౌండేషన్ ద్వారా రూ. 2 లక్షలతో నిర్మించిన టాయిలెట్స్‌ను సందర్శించారు. అనంతరం పదిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి రూ.10 వేల అందించి, గ్రామస్తులతో కలిసి పాఠశాల విద్యార్థుల వ్యక్తిగత క్యాలెండర్ ఆవిష్కరించారు.

తైక్వాండో కలర్ బెల్టులు ప్రదానం

కోరుట్ల: పట్టణంలోని నవజ్యోతి హైస్కూల్‌లో ఆదివారం మాస్టర్ తైక్వాండో ఆధ్వర్యంలో బెల్ట్ అప్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించి 75 మంది తైక్వాండో ప్లేయర్స్‌కు కలర్ బెల్టులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ కరీంనగర్ జిల్లా జనరల్ సెక్రటరీ సంతోశ్, జగిత్యాల వైస్ ప్రెసిడెంట్ రాజేందర్, రమేశ్, కరస్పాండెంట్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు స్నేహ సంబంధాలు పెంపొందిస్తాయి

రాయికల్: క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతున్నాయని మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు. రాయికల్ పట్టణంలో రాయికల్ క్రికెట్ లీగ్ పోటీలను ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. క్రికెట్‌తో యువకుల్లో స్నేహసంబంధాలతో పాటు ఆత్మస్థైర్యం పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సాయికుమార్, తురగశ్రీధర్ రెడ్డి, మహేందర్, స్పాన్సర్లు శేఖర్‌రావు, డాక్టర్ అందె ఉదయ్, డాక్టర్ గట్ల నరేష్, రాజరాణి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ నియామకం

మేడిపల్లి: బీసీ,ఎస్సీ, మైనారిటీ సంఘం భీమారం మండల కమిటీని నియమించినట్లు రాష్ట్ర కార్యదర్శి రేండ్ల లచ్చయ్య పటేల్ తెలిపారు. భీమారం మండల అధ్యక్షుడిగా ప్యాట నరహరి, ఉపాధ్యక్షుడిగా సుందరగిరి నర్సయ్య గౌడ్, జిల్లా కార్యదర్శిగా నీలి అంజయ్యను నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నేరటి మల్లేశం, చెక్కపల్లి శంకర్, కాల్వ లింబద్రి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రామసభలు

బుగ్గారం(గొల్లపల్లి): ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేయడానికి మండలంలోని వివిధ గ్రామాల్లో నేటి నుంచి జనవరి 24వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాంరెడ్డి తెలిపారు. ఈ సభల ద్వారా రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, ఆమోద ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు.

పెగడపల్లి: ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కింద ఈ నెల 21 నుంచి గ్రామసభలు నిర్వహిస్తామని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

108 మొక్కలు అందజేత

మల్లాపూర్: మండలంలోని కనకసోమేశ్వర ఆలయ సన్నిధిలో ఆదివారం ఏకబిల్వ బహుబిల్వ ఉసిరి సంపంగి మహాబిల్వ వృక్షాలకు సంబంధించిన 108 మొక్కలను ఆదివారం అందజేశారు. తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు సంగెపెల్లి సుధాకర్‌శర్మ సహకారంతో స్థానిక పురోహితులు బాల్యపెల్లి సుదాకర్‌శర్మ–తారాదేవి దంపతులు అందజేశారు. పురోహితులు బాగెపల్లి ప్రభాకర్‌శర్మ మంత్రోచ్చారణల మధ్య శివ దీక్ష భక్తులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సంగ గంగరాజం, సభ్యులు శివరామకిషన్ పాల్గొన్నారు.

రైతుభరోసా కోసం అధికారుల సర్వే

సారంగాపూర్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వ్యవసాయానికి పెట్టుబడి సాయం కింద ఎకరానికి ఏడాదికి రూ.12 వేలు అందించే పథకంలో వ్యవసాయేతర భూములను గుర్తించాలని చేపట్టిన సర్వే ముగింపు దశకు చేరింది. ఆదివారం నాలుగో రోజు వరకు సర్వే నిర్వహించి సారంగాపూర్ మండలంలో వ్యవసాయేతర భూముల కింద సాగుకు అనుకూలంగా లేని భూమలు 28 ఎకరాలు గుర్తించారు. బీర్‌పూర్ మండలంలో 21 ఎకరాలు గుర్తించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు ప్రదీప్‌రెడ్డి, రాజ్‌కుమార్, ఆర్ఐలు శ్రీనివాస్, వెంకటేశ్, ఏఈవోలు అంజనేయులు, వెంకటేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపన

బుగ్గారం(ధర్మపురి): ధర్మపురి మున్సిపాలిటీలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీ గడ్డం వంశీ ఆధ్వర్యంలో నేడు శంకుస్థాపన చేయనున్నారు. పట్టణ పరిధిలో సుమారు 10 కోట్ల రూపాయలతో అనేక అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

క్లుప్తంగా

పసుపు బోర్డు చైర్మన్‌కు సన్మానం


సన్మానిస్తున్న భోగశ్రావణి, నాయకులు

జగిత్యాల: జాతీయ పసుపుబోర్డు మొదటి చైర్మన్‌గా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గంగారెడ్డి ఎన్నిక కాగా, ఆదివారం జగిత్యాల ఇన్‌చార్జి భోగ శ్రావణి నాయకులు సన్మానించారు. ఆమె వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

పసుపు బోర్డు చైర్మన్‌ను కలిసిన బీజేపీ నాయకులు

కోరుట్ల రూరల్: కోరుట్ల మండల బీజేపీ నాయకులు నూతనంగా ఏర్పాటైన జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా నియమితులైన పల్లె గంగారెడ్డిని ఆదివారం కలిసి శాలువాతో సత్కరించారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ కృషి వల్లనే ఐదు దశాబ్దాల పసుపు బోర్డు కల నెరవేరిందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకులు గుగ్గిళ్ల తుక్కారాం గౌడ్, తోట లింగారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు అంబల్ల సుదర్శన్, మండల అధ్యక్షుడు, మండల ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

కోరుట్ల రూరల్: మండలంలోని కల్లూర్‌లో కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వైద్యులు గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు.డాక్టర్ శ్రీకాంత్ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి 2డీ ఇకో, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. 120 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, గౌడ సంఘ అధ్యక్షుడు నర్సాగౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ వెంకటేష్, మాజీ సర్పంచ్ వంతడుపుల అంజయ్య, మెడికల్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

జగ్గాసాగర్‌లో..

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో రెనె హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆదివారం గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో 150 మందికి పైగా ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు.అనంతరం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు స్వామి, అజయ్, నాయకులు జగన్, గంగాధర్, పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలకు వాటర్ ఫ్రిడ్జ్ వితరణ


ఫ్రిడ్జ్ అందిస్తున్న కుటుంబ సభ్యులు

రాయికల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పట్టణానికి చెందిన కల్లెడ లక్ష్మి జ్ఞాపకార్థం భర్త కల్లెడ భూమయ్య, కుటుంబ సభ్యులు ఆదివారం రూ. 25 వేల విలువగల వాటర్ ఫ్రిడ్జ్ ను అందజేశారు. ఈ సందర్భంగా వారిని కళాశాల ప్రిన్సిపాల్ రాజేష్ అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తురగ శ్రీధర్ రెడ్డి, అధ్యాపకులు చౌదారపు శ్రీనివాస్, రాజమౌళి, రవీందర్, దేవేందర్, ఉష రజిత, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు

కోరుట్ల: పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఆదివారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య ప్రారంభించారు. స్కూల్ ప్రిన్సిపాల్ రేణుక మాట్లాడుతూ బిజీ లైఫ్‌లో ఆటల వలన మానసికోల్లాసం కలుగుతుందని పేర్కొన్నారు. పోటీల్లో పిల్లల తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం రాజు, కో–ఆర్డినేటర్ నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు చెక్కులు పంపిణీ

కోరుట్ల రూరల్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ లబ్ధిదారులకు సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు పంపిణీ చేయనున్నట్లు కార్యాలయ అధికారులు తెలిపారు.



కథలాపూర్: మండలంలోని సిరికొండ గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రం భవనం నిర్మాణం పనులు అసంపూర్తిగా వదిలేశారు. భవనం నిర్మాణం పనులు ప్రారంభించి ఏడాది గడిచినా ఇప్పటికీ పూర్తి కాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి ఆరోగ్య ఉపకేంద్రం భవనం నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
నాగరాజు, వైద్యశాఖ ఇంజనీరింగ్ అధికారి,జగిత్యాల సెల్ నంబర్: 9989418277

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ఘనంగా మల్లికార్జునస్వామి జాతర


పట్నాల ముగ్గు వద్ద పూజలు చేస్తున్న నాయకులు, గ్రామస్తులు

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల గ్రామంలో ఆదివారం మల్లికార్జునస్వామి జాతర ఘనంగా నిర్వహించారు. ఆలయం ఆవరణలో ఒగ్గు కళాకారులు పట్నాల ముగ్గు వేయగా, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. జాతర ఉత్సవాలకు హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. ఈ ఉత్సవాల్లో వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహా స్వామి కల్యాణం


స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లులలో ప్రహ్లాద లక్ష్మీనరసింహా స్వామి ఆలయ బ్రహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆదివారం ఆలయంలో బలిహారణం, పూర్ణాహుతి చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి కల్యాణం తిలకించారు.భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వీడీసీ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేట జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2013–14 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఒకే చోటు కలిశారు. 12 ఏళ్ల తర్వాత కలుసుకున్న విద్యార్థులంతా ఆత్మీయంగా పలకరించుకుని బాగోగులు తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. తమకు పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు.


సమావేశమైన పూర్వ విద్యార్థులు

పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి

రాయికల్: పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు అన్నారు. ఆదివారం రాయికల్ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యల సాధన కోసం తన వంతుగా పోరాటం చేస్తామని, అదేవిధంగా జరగబోయే ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. అనంతరం ట్రస్మా నాయకులు శేఖర్‌రావును సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ రావు, గౌరవ అధ్యక్షుడు భోగ రవి ప్రసాద్, ఉపాధ్యక్షులు ఎద్దండి ముత్యపు రాజు రెడ్డి, బాలే శేఖర్ ,కైరం సత్యం, వేణుగోపాల్ రావు, రవీందర్ రెడ్డి, రాజు పాల్గొన్నారు


ట్రస్మా సభ్యులతో యాదగిరి శేఖర్‌రావు